# అబల మనస్సు

'హరిప్రియ'

కండక్టరు మూడుసార్లు పిలిచినా వినిపించలేదు. వెంకట్రావుకు. భుజంమీద తట్టి పిలిచినప్పుడుగాని తన పరధ్యానంనుంచి బయట బడలేకపోయాడు. ఇన్నిసార్లు పిలిచినా వినుపించుకోని తనపరధ్యానానికి సిగ్గుపడ్డాడు. తోటిప్రయాణీకులు తనను చూచి నవ్వుతున్నట్లు భావపడ్డాడు. టిక్కట్టు ఛార్జిపోను కండక్టరు ఇచ్చిన చిల్లర జేబులో వేసుకున్న తరువాత, ఇచ్చిన చిల్లర సరిగా వున్నదా లేదా అన్నశంక అతనిలో కలిగింది. తిరిగి లెక్క పెట్టడం అంత మందిలో చిన్నతనమనిపించింది వెంకట్రావుకు. కుదుపులు లేకుండా మెత్తగా పోతున్నది తారురోడ్డుమీద బస్సు. చల్లగాలికి మళ్ళీ ఆలోచనలో పడ్డాడు వెంకట్రావు.

సీతకు తానుచేసిన అపకారం భయంకరముగా గోచరించింది. వెంకట్రావు గుండెలో చెయ్యిపెట్టి కెలికినట్లు భాదపడ్డాడు. దానికి కారణం తనకొఱకు ఆమెచేసిన త్యాగం. తను ఆమెకు చేసిన ద్రోహం. తండ్రివలదని వారించిన ధిక్కరించి, చివరకు ఒప్పించి తనను వివాహమాడింది. నిజానికి తాను సీత స్థితికి తగడు. తండ్రిచనిపోతు ఆమె పేర ఇచ్చినయావదాస్థిని అతని పేర వ్రాసింది తన పేరున ఉండుట ఇష్టంలేక. అటువంటి సీతకు అతను చేసినద్రోహం భయంకరంగా గర్జించింది అతని చెవులలో. తనను దైవసమానంగా చూచిన సీతను నిర్దాక్షిణ్యంగాహింసించగా ఇల్లువదలి వెళ్ళి మూడు మాసములైనది. ఇంత కాలంగా ఆమెపడ్డ మనోవేదనను ఊహించి అతని మనస్సు తల్లడిల్లింది. ఈ విషయంలో సీతతప్పు లేదని ఈనాటికి గుర్తించాడు. అనేక చెడువ్యసనాలకులోనై డబ్బును నీళ్ళలాగా ఖర్చుపెడుతున్నందుకు ఆమె చాలా దుఃఖించింది. ఆమె దుఃఖము అతని ధన వ్యయాన్నిగురించిగాదు అతని పరువు ప్రతిష్ఠలనుగురించి, ఆరోగ్యాన్నిగురించి. చెడుస్నేహాలు మానమని కాళ్ళ - వేళ్ళబడి కన్నీరు - మున్నీరుగా విలపించింది. దాని ఫలితం అతడు తనలోనిమానవత్వాని మరుగుచేసుకొని ఆమెపై చెయి చేసుకొనే నీచస్థితిలోకి దిగజారినాడు. తల్లిని కొట్టునప్పుడు అడ్డువచ్చిన అభం - శుభం తెలియని ఎనిమిదేండ్లపసిబాలుడు బాబుమీద మంచీ _ చెడూ లేకుండా చెయ్యి చేసుకున్నాడు. ఆనాడే ఎవరితో చెప్పకుండా వెయ్యిరూపాయలతో ఇల్లువదిలి వెళ్ళి ఇప్పటికి మూడుమాసములు. గతమంతా కలలా కళ్ళకు కట్టినట్లు గోచరించింది వెంకట్రావుకు. వెచ్చటికన్నీరు చెతిమీద రాలు

వరకు తను ఏడుస్తున్నట్లు గుర్తించలేక పోయాడు వెంకట్రావు. తోటిప్రయాణీకులు చూచెదరని పైపంచతో తన ముఖాన్ని దాచుకున్నాడు. హృదయంలోని దుఃఖము అగ్ని పర్వతంలా బ్రద్దలైంది. ఏడ్పును ఆపుకోవడంలో అతనిముఖము అరుణార్ణవమైంది.

ఊరు దగ్గరకు చేరుతున్నకొద్ది అతనిలో ఆరాటం హెచ్చింది. సీతకు తన ముఖమెలా చూపడం! అని బాధపడ్డాడు. తనకు తానుగా ఇల్లు వదలివెళ్ళి తానై తిరిగి వస్తున్నాడు. భార్యా పిల్లలను చూడాలన్నకోర్కె అతనిలో బలపడింది. కాని అతని హృదయాన్ని అంతులేని అభిమానం ఆవరించుకొని యున్నది. తన రాకను ఊరిలోవారు ఎలా ఊహించుకుంటారో? అయినా తనదారాపుత్రులను చూడడానికి ఒకరి ఊహా-పోహలతో తనకేంపని అన్నభావన అతనిలో మెదలింది. ఇట్టి అనిశ్చయపరిస్థితిలో అతని మనస్సు డోలాయమానమైంది. భార్య పుత్రులపై మమకారం అతని అభిమానాన్ని అణగార్చినవి. తెగని ఆలోచనలు తరుగకుండా వస్తున్నాయి. తాను దిగవలసినగ్రామం వచ్చింది. అది ఆగవలసినచోట బస్సు ఆగింది. వెంకట్రావు బస్సుదిగే ప్రయత్నం చేయలేదుగదా! దిగవలెనా వద్దా అన్న సందేహం అతనిలో కలిగింది. కండక్టరు హెచ్చరిక కళ్ళెంలాపని చేసింది అతనిపై. బస్సుదిగి ఆలోచిస్తూనిలుచున్నాడు కొద్దిసేపు. కూలీ, కూలీ, అంటూ కుర్రవాళ్లు మూగేసరికి కదలకతప్పిందికాదు. మాసిన గుడ్డలసంచీతో వంచిన తల ఎత్తకుండా నడుస్తున్నాడు వెంకట్రావు. పరిచయంకల వారుకూడా అతని పరిస్థితిచూచి నాలుక చివరివరకువచ్చికూడా అతనిని పలుకరించలేకపోయారు, వెంకట్రావురాక వీధిలో ఆడుకునేపిల్లలవలనముందుగా విన్న సీతను సంభ్రమాశ్చర్యాలు ముంచుకొచ్చినవి. ఆమె కళ్లలో ఆనందబాష్పాలు తొణికిసలాడినవి. ఆ సంతోషంలో ఆమెమోము దిరిసెనపువ్వుల ఎర్రబారింది. ఉప్పొంగు సంతోషంతో అతనిరాకను ఎదురుచూస్తు వాకిట్లోనిలుచున్నది. తల్లి చీర చెంగు పట్టుకొని బాబు నిలబడియున్నాడు. తండ్రి రాకచూడ—నే మూడు నెలల క్రిందటి దృశ్యం అతనిచిన్ని మనస్సులో మెదిలింది. కొద్దిగా కలవరపడ్డాడు దానిని ఊహించుకొని. దూరమునుంచి భార్యా పుత్రులను వాకిట్లోచూచి వెంకట్రావుకొద్దిగా కలవరపడినాడు సిగ్గుతోకృంగిపోతు ఇంటి అరుగు ఎక్కాడు. వెంకట్రావు ఆగమనాన్ని ఎంతో సంతోషంతో ఎదురుచూచిన సీత అతను ఇంటిలోకాలిడగానే, వెల్లువవలె ముంచుకొనివచ్చు దుఃఖముతో తనను క్షమించమని అతనికాళ్లపైబడి వేడింది. నిర్విణ్ణుడైనాడు వెంకట్రావు. ఎవరినైతే తాను తనను క్షమించమని కోరుదామనుకొన్నాడో, ఆ వ్యక్తి తనక్షమాపణను కోరుచున్నది. అతని కనులు చెమ్మగిల్లినవి. తల్లిప్రక్కన నిలుచునివున్న బాబునిచూచి ఒక్కింత చలించాడు వెంకట్రావు. అబల మనస్సు అతనికి అర్థమయినది.